నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 22 డిసెంబర్ 2024 | NIZAMABAD

మోర్తాడ్‌లో డివైడర్ వద్ద నుంచే అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

మొక్కల సంరక్షణపై పర్యవేక్షణ ఏదీ?

- రెండు, మూడు నెలల్లోనే ఎందుకు ఎండిపోతున్నయ్..
- వెంటనే నీళ్లు పోయించి సంరక్షించండి
- అధికారులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల సూచన

మోర్తాడ్, డిసెంబర్ 21: డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయని, నీళ్లు పోయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని సుంకెట్ గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా మోర్తాడ్‌లోని సెంట్రల్ లైటింగ్ డివైడర్‌లో పచ్చదనం, సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోవడాన్ని చూశారు. వాటిని పరిశీలించి అక్కడే నిలబడి ఎంపీడీవో తిరుమలతో ఫోన్‌లో మాట్లాడారు. మొక్కలకు సరిగ్గా నీళ్లు పట్టని కారణంగా ఎండిపోతున్నాయని, ఎందుకు పర్యవేక్షించడం లేదని ప్రశ్నించారు. ఏడాదికాలంగా పచ్చగా ఉన్న మొక్కలు ఈ రెండుమూడు నెలల్లోనే ఎందుకు ఎండిపోతున్నాయన్నారు. మూడేండ్ల క్రితం నాటిన మొక్కలు మూడు నెలల క్రితం వరకు పచ్చగా ఉన్నాయని, అవి ఇప్పుడు ఎండిపోతున్నాయని, రోజూ నీళ్లు పట్టించి తిరిగి జీవం పోసుకునేలా చేయాలని సూచించారు. మళ్లీ తాను వచ్చే సరికి డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలు పచ్చగా కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, పాపాయి పవన్, యూసుఫ్, ఏనుగు రాజేశ్వర్, తొగటి శ్రీనివాస్ ఉన్నారు.

నిజామాబాద్‌లో హోమంలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

డిమాండ్లు నెరవేర్చాలని హోమం

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె

కంఠేశ్వర్/ కామారెడ్డి, డిసెంబర్ 21: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. ఇందులో భాగంగా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో హోమం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డికి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే సంకల్ప బలం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తమ సర్వీసును రెగ్యులర్ చేసే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

కామారెడ్డిలో రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల ఆందోళన

రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్

కామారెడ్డి, డిసెంబర్ 21 : తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు ఆందోళన చేపట్టారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను ప్రస్తుతం పరీక్ష రాసిన తర్వాతనే రెగ్యులర్ చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. తాము ఉద్యోగంలో చేరే సమయంలోనే పరీక్షలు రాసి, ఉద్యోగంలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమను రెగ్యులర్ చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు పట్టించుకోవడంలేదని, ఇప్పుడు రాత పరీక్ష రాయాలంటూ చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తమకు 23 సంవత్సరాల అనుభవం ఉన్నదని, ఎలాంటి రాత పరీక్ష లేకుండా తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేసే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రైతుభరోసాపై మీనామేషాలు లెక్కిస్తున్నది. ఈ పథకం అమలుపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అదే సమయంలో అనుమానాలు, భయాలూ వెంటాడుతున్నాయి. రైతుబంధు తరహాలో పెట్టుబడి సాయం అమలవుతుందా? లేదంటే కొందరికే పెట్టుబడి సాయం అందుతుందా? అనే అంశంపై స్పష్టత కరువైంది. 2023లో యాసంగి సీజన్‌కు కొందరికే, అది కూడా కొద్ది మందికి మాత్రమే నామ మాత్రంగా కేసీఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధు సాయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జమ చేసింది. తర్వాత 2024లో వానకాలం సీజన్‌ను పట్టించుకోలేదు. పైసా పెట్టుబడి సాయం అందలేదు. ప్రస్తుతం యాసంగి సీజన్ అమలవుతున్నప్పటికీ పెట్టుబడి సాయంపై స్పష్టత కరువైంది. ప్రభుత్వం మాత్రం రైతుభరోసాను త్వరలోనే అమలు చేస్తామంటూ చెబుతోంది. శనివారం శాసనసభలో రైతుభరోసా అమలుపై స్వల్పకాలిక చర్చ జరిగింది. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చర్చను ప్రారంభించగా, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ తన వైఖరిని కుండబద్దలు కొట్టింది. రైతుల్లో అలుముకున్న అనుమానాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సాంకేతిక అంశాలతోపాటు శాస్త్రీయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. రైతుభరోసాను అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. శాసనసభలో రైతుభరోసాపై వాడివేడిగా వాదోపవాదాలు జరిగిన నేపథ్యంలో రైతన్నల్లోనూ భారీగా ఆశలు ఏర్పడ్డాయి. కేసీఆర్ అందించినట్లుగానే రైతులకు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం కల్పించాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

–నిజామాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రైతన్నకు ఏది భరోసా?

సర్కారు నుంచి స్పష్టత కరువు

- 'సాయం' అందరికా.. కొందరికా?
- రైతు భరోసాపై రైతుల్లో అనుమానాలు
- కోతలు పెట్టేందుకు సర్కారు యత్నాలు
- అసెంబ్లీ సమావేశాల్లో స్వల్పకాలిక చర్చ
- పెట్టుబడి సాయంపై వాదోపవాదాలు
- రైతుబంధు తరహాలో అమలు చేయాలన్న బీఆర్ఎస్
- పత్తాలేని వానకాలం, యాసంగి పెట్టుబడి సాయం

బీఆర్ఎస్ హయాంలో ఒక్క పంట కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా 5లక్షల మంది రైతులకు (రైతుబంధు)పెట్టుబడి సాయం అందేది. ఇలా ఏటా రెండు పంట కాలాల్లో రూ.వెయ్యి కోట్లకు పైగానే రైతుబంధు ద్వారా ఎకరానికి రూ.10వేలు చొప్పున సాయం అందించారు.ఏడాది క్రితం కొలువు దీరిన రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం కంచనగా రైతులకు అందాల్సిన రైతుభరోసాను ఇవ్వకుండా తాత్సారం చేస్తోంది. వానకాలం పంటకు పెట్టుబడి సాయం ఇవ్వకుండానే ఎగవేతకు పాల్పడింది. యాసంగికి రైతుభరోసా అమలు చేస్తామని చెబుతున్నప్పటికీ స్పష్టత కరువైంది. పంటలు పండించే భూములకే సాయం అందిస్తామంటూ సర్కారు ప్రకటించిన నేపథ్యంలో ఎవరెవరికి పెట్టుబడి సాయం అందుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏ పంటలు సాగు చేస్తే వర్తిస్తుందో తెలియక రైతులు గందరగోళంలో ఉన్నారు. ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి సాయం ఉంటుందా? లేదా అన్నది తేలలేదు. మరోవైపు పామాయిల్ లాంటి దీర్ఘకాలిక పంటలు సాగు చేస్తున్న రైతులకు రైతుభరోసా వస్తుందా రాదా? అనే విషయంపై స్పష్టత కరువైంది. అంకాపూర్ వంటి ప్రాంతాల్లో మూడు పంటలు సాగు చేసే రైతులున్నారు. పంటల ఆధారంగా పెట్టుబడి సాయం ఇస్తే వీరికి మూడు విడుతల్లో రైతుభరోసా వస్తుందా? అని రైతులు అడుగుతున్నారు. పసుపు పంట సాగు చేసే వారికి ఏడాది కాలం గడిచిపోతుంది. తొమ్మిది నెలల పసుపు పంటను సాగు చేసే వారికి ఏ ప్రాతిపదికన రైతు భరోసా అందిస్తారో తెలియడం లేదంటూ రైతులు వాపోతున్నారు. బీఆర్ఎస్ హయాంలో 2023లో వానకాలం సీజన్‌లో లక్షలాది మందికి రైతుబంధు సాయం అందింది. నిజామాబాద్ జిల్లాలో 2లక్షల 82వేల మందికి రూ.274 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 2లక్షల 90వేల మంది రైతులకు రూ.250కోట్లు పెట్టుబడి సాయం అందజేశారు. రైతుబంధు పథకాన్ని 11 విడుతల్లో విజయవంతంగా అమలు చేసి రైతులను ఆదుకుంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుభరోసా పేరుతో రూ.15వేలు ఇస్తామని ఇచ్చిన హామీపై ఇప్పటికీ స్పష్టత రాకపోవడం గమనార్హం.

రుణమాఫీపై మొండి 'చెయ్యి'

రూ.2లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి తీవ్ర అయోమయాన్ని సృష్టించిన రేవంత్ సర్కారు, ఇప్పటి వరకు నాలుగు విడుతల్లో ఈ పథకాన్ని అమలు చేసి కొంత మందిని మాత్రమే రుణ విముక్తులను చేసింది. అనేక మందికి మొండి 'చెయ్యి' చూపింది. సాంకేతిక కారణాలను చూపి చాలా మందిని పక్కన పెట్టింది. కుటుంబంలో ఒకరికే రుణమాఫీ అంటూ సగానికి ఎక్కువ మందిని పక్కన పెట్టింది. తాజాగా రైతుభరోసా పథకం అమలులోనూ ఇదే అస్తవ్యస్త విధానం కనిపిస్తుండడంపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతులు గుర్రుమంటున్నారు. రైతుభరోసానైనా సమయానికి వస్తుందేమో నని గంపెడాశతో ఎదురు చూస్తే అదీ కూడా పత్తా లేకుండా పోయింది. బాన్సువాడ, బోధన్, జుక్కల్ ప్రాంతాల్లో యాసంగి సీజన్‌కు సంబంధించిన నాట్లు మొదలయ్యాయి. ఇంకో వారం, పది రోజుల్లో ఉమ్మడి జిల్లా అంతటా వరి నాట్లు ఊపందుకోనున్నాయి. ఈ దశలోనూ ప్రభుత్వం పెట్టుబడి సాయం చేసేందుకు ముందుకు రాలేదు. గతంలో రైతుబంధు పేరుతో ఏటా ఎకరానికి రూ.10వేలు చొప్పున కంచనగా అందింది. ఎన్నికల్లో ఏటా రూ.15వేలు ఎకరానికి పెట్టుబడి సాయం అందిస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. ఏడాదికి రెండు పంటలకు ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.7500 చొప్పున సాయం అందాల్సి ఉండగా ఇప్పటికీ చిల్లిగవ్వ అందలేదు. ఈ మధ్యనే రైతుభరోసా అమలుపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసిన నేపథ్యంలో రైతులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

బాన్సువాడ, డిసెంబర్ 21: రైతు భరోసా ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయకపోవడం బాధాకరం. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చినట్లు ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఇవ్వాలి. రైతు భరోసా డబ్బులు క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో వేయాలి. ఇప్పటికే రెండు పంటలకు ఇచ్చే పెట్టుబడి ఇవ్వకపోవడం శోచనీయం. వెంటనే రైతుభరోసా అమలుచేయాలి.

- చాకలి సాయిలు, రైతు, కొల్లూర్

రైతు భరోసా వెంటనే ఇవ్వాలి

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 21 : వానకాలం పంటలు పూర్తి అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుభరోసా ఇవ్వలేదు. గత ప్రభుత్వం పంటలకు ముందే రైతుబంధు పైసలు బ్యాంకుల్లో వేసేది. వానకాలం పంటలతో పాటు యాసంగి పంటలు సాగు చేస్తున్న. రెండు పంటలకు పెట్టుబడి కింద ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రభుత్వం రైతుల మేలు కోరుతూ రెండు పంటలకు రైతు భరోసా ఇచ్చి ఆదుకోవాలి.

-గన్ను నాయక్, రైతు, కొయ్యగుట్ట తండా

కాంగ్రెస్ రైతుల ఉసురుపోసుకుంటున్నది

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 21: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇప్పటివరకు రైతు భరోసా మాటే లేదు. 15 వేల రూపాయల రైతు భరోసా అందిస్తామని చెప్పి రైతుల ఓట్లను దండుకున్నది. అధికారంలోకి వచ్చాక రైతుల ఉసురు పోసుకుంటున్నది. రైతుభరోసా పెంచి అందించే మాట దేవుడెరుగు, ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం కూడా దిక్కులేకుండా పోయింది.

- గణేశ్, రైతు, బాన్సువాడ

ఆగని నిరసనలు

- అమిత్ షా వ్యాఖ్యలపై దళిత, అంబేద్కర్ సంఘాల ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ఆందోళనలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 21: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ దళిత, అంబేద్కర్ సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్నాయి. శనివారం బోధన్, బాల్కొండ, వేల్పూర్, ముప్కాల్, కోటగిరి, పొతంగల్, బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టారు. పలు మండలాల్లో అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్‌షా వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని, తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సాలూర మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర రహదారిపై అమిత్‌షా దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

'హమాలీ' పేరిట దోపిడీ

గిడ్డంగుల్లో నిబంధనలు బేఖాతరు
సంచికి రూ.3 చొప్పున అదనంగా వసూలు
రాష్ట్ర గిడ్డంగుల సంస్థ సిబ్బంది సహకారం
నష్టపోతున్న సరుకు రవాణాదారులు

రైతులకు కనీస మద్దతు ధరతోపాటు దళారి వ్యవస్థను నిర్మూలించడానికి రాష్ట్ర వ్యాప్తంగా సోయా, మక్కజొన్న, శనగ, ఇతరత్రా వాణిజ్య పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. కానీ రైతులకు లాభం చేకూరకపోగా.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మాత్రం ఇందుకు విరుద్ధమైన చర్యలు కనిపిస్తున్నాయి. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన సోయా పంటను నిల్వ చేసేందుకు గిడ్డంగులకు తరలించే క్రమంలో హమాలీ కాంట్రాక్టర్లు డబ్బులు గుంజుతున్నారు. లేదంటే గిడ్డంగుల్లో సోయా ఉత్పత్తులను దించుకునేది లేదంటూ మొండికేస్తున్నారు. టెండర్ నిబంధనలు తుంగలోకి తొక్కి నడస్తున్న ఈ దోపిడీ తంతు బహిరంగంగానే అధికారికంగా కొనసాగుతుండడం గమనార్హం.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థలో అక్రమ వసూళ్ల పర్వం కొనసాగుతున్నది. ఈ సంస్థ కార్యకలాపాలు మిగతా శాఖలకు భిన్నంగా కొనసాగుతుంటాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సంస్థ ఆధీనంలో లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ చేసే గిడ్డంగుల నిర్వహణ కొనసాగుతున్నది. బీఆర్ఎస్ హయాంలో వీటి నిర్వహణ క్రమపద్ధతిలో కొనసాగగా.. ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఫలితంగా చివరికి రైతులపై భారం పడుతున్నది.

– నిజామాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

పరోక్షంగా రైతులపై భారం

గిడ్డంగుల సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంతో హమాలీ దోపిడీ ప్రభావం నేరుగా రైతులపై పడుతున్నది. సోయా అమ్ముకున్న రైతుల సరుకును తరలించేందుకు లారీ యజమానులు క్షేత్ర స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నారు. హమాలీ కాంట్రాక్టర్లు తమను అదనంగా డబ్బులు అడుగుతుండడంతో రవాణాదారులు చేసేది లేక రైతుల నుంచి ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని మార్క్‌ఫెడ్ అధికారులు గుర్తించినా ఏమీ చేయలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లా భౌగోళిక పరిధికి సంబంధించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్యకలాపాలు గుట్టు చప్పుడు కాకుండా నిజామాబాద్ నగరంలో నిర్వహిస్తున్నారు. వాస్తవానికి సారంగపూర్‌లోని గిడ్డంగుల సంస్థ ఆవరణలోనే జిల్లా మేనేజర్ కార్యాలయాన్ని నిర్మించేందుకు, గతంలో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇందుకు సంస్థ అధికారులే అడ్డుపుల్ల వేసినట్లు సమాచారం. గోదాముల్లో ఏదో ఒకప్రదేశంలో సర్దుకోవడం కుదరదంటూ ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా కిరాయి భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయం సర్దుబాటుకు అవకాశం ఉన్నప్పటికీ జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నెలకు కిరాయి చొప్పున ప్రభుత్వంపై అదనపు భారం పడుతోంది. సమీకృత కలెక్టరేట్‌కు దూరంగా గిడ్డంగుల సంస్థ కార్యకలాపాలు కొనసాగుతుండడం.. రైతులు, వ్యాపారులు, ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణకు అడ్డంకిగా మారింది.

చర్యలు తీసుకుంటాం

హమాలీ కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ కాంట్రాక్ట్ నిబంధనల మేరకే హమాలీలను సమకూర్చాలి. అదనంగా ఎవరి నుంచి పైసా వసూలు చేయడానికి వీల్లేదు. ఈ విషయంపై దృష్టి సారిస్తాం.

- రాజ్యలక్ష్మి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ జిల్లా మేనేజర్

సంచికి రూ.3 అదనంగా దోపిడీ

కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా సోయా పంటను సాగు చేస్తుంటారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలోని రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్‌కు చెందిన గోదాముల్లో సోయా నిల్వకు చేపడుతున్న చర్యల్లో పారదర్శకత లోపించింది. సోయా కొనుగోలు కేంద్రాల నుంచి గిడ్డంగులకు చేరుతున్న సంచులను దించుకునేందుకు సంస్థకు మానవ వనరుల కొరత ఏర్పడడంతో ఓపెన్ టెండర్ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు ఈ పనిని అప్పగించింది. టెండర్ ప్రక్రియలో అనేక లోటుపాట్లతో పనులు దక్కించుకున్న వారంతా ఇప్పుడు అక్రమాలకు తెరలేపారు. గిడ్డంగుల సంస్థకు చేరిన లారీల్లోని సోయా సంచులను దించుకునే క్రమంలో సంచికి రూ.9 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సంచికి రూ.6 చొప్పున ప్రభుత్వమే సంబంధిత హమాలీ కాంట్రాక్టర్‌కు గిడ్డంగుల కార్పొరేషన్ ద్వారా చెల్లిస్తుంది. అయితే కొందరు కాంట్రాక్టర్లు ఇదికాకుండా సంచికి అదనంగా మరో రూ.3 చొప్పున దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ దోపిడీ ముఖ్యంగా ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని గిడ్డంగుల సంస్థ పరిధిలోని గోదాముల్లో యథేచ్ఛగా జరుగుతోంది. ఈ విషయంపై హమాలీ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని గిడ్డంగుల సంస్థ జనరల్ మేనేజర్‌కు పలువురు సరుకు రవాణాదారులు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. హమాలీ కాంట్రాక్టర్ల దోపిడీలో గిడ్డంగుల సంస్థ అధికారుల పాత్ర ఉన్నట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు.